

రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేటలో ఆదివారం భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవనం, గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డిని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా సీఎంను శాలువాతో సన్మానించి వినతిపత్రం అందజేశారు. - అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి



రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్‌లో భారత ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) భవనం, గ్రీన్‌ఫీల్డు రేడియల్ రోడ్డు పనుల శంకుస్థాపనకు హాజరైన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని టీజీ క్యాబ్ వైస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య శాలువతో సన్మానించారు. - హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి



నూతనంగా ఎన్నికైన ప్రశాంత్‌నగర్ షిరిడీ సాయిబాబా సంస్థాన్ కమిటీ సభ్యులు

షిరిడీ సాయిబాబా సంస్థాన్ కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని షిరిడీ సాయిబాబా సంస్థాన్ నూతన కమిటీ ఎన్నికైంది. చైర్‌పర్సన్‌గా పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, వైస్ చైర్మన్‌గా డి.వెంకటేశ్వరరావు, ఆర్.వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శిగా జె.రవీందర్‌బాబు, సహాయ కార్యదర్శిగా బి.ప్రభాకర్, కోశాధికారిగా టి.రమేష్, కార్యవర్గ సభ్యులుగా ఆర్.అంజయ్య, పి.నిర్మలా చౌదరి, పి.రాజేంద్రప్రసాద్, వై.సీతారామిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి కృషిచేసిన కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు.

డివిజన్ ప్రజల ప్రయోజనానికి కృషి : పవన్‌కుమార్

కొత్తపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ ప్రజల ప్రయోజనానికి కృషి కొనసాగిస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు రామచందర్‌రావుతో కార్పొరేటర్ల సమావేశం నిర్వహించారన్నారు. ప్రజల సమస్యలకు సత్వరమే స్పందించాలని దిశానిర్దేశం చేశారని పవన్‌కుమార్ ప్రస్తావించారు.



రామచందర్‌రావును శాలువాతో సన్మానిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



శివసాయి కరుణా మందిరంలో మహాచండీయాగంలో పాల్గొన్న దంపతులు

ఘనంగా మహాచండీయాగం

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకుని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాములలోని శివసాయి కరుణామందిరంలో ఆదివారం మహాచండీయాగం నిర్వహించారు. ఆలయ చైర్మన్ పరంకుషారావు ఆధ్వర్యంలో బాలాచార్యులు నేతృత్వంలో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ చండీయాగం ఘనంగా నిర్వహించారు. ఈ చండీయాగంలో పలువురు దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలుచేశారు. ఈ యాగంతో ప్రజలందరు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉంటారని బాలాచార్యులు తెలిపారు. ఆలయ చైర్మన్ పరంకుషారావు మాట్లాడుతూ ఇలాంటి ధార్మిక కార్యక్రమాల ద్వారా సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం పెరుగుతుందన్నారు. దాతలు ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం : వనస్థలిపురం రెడ్‌ట్యాంక్ సమీపంలోని ప్రసిద్ధ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఐదవరోజు ఆదివారం మంగళవాయిద్యాలు, సుప్రభాతసేవ, సహస్రనామార్చన, సుదర్శన హోమం, శ్రీవారి కళ్యాణం, తిరువీధి ఉత్సవం, మహానివేదన, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, కో.చైర్మన్ గణపతి, ఆర్.జగదీశ్‌కుమార్, పాపారావు, కె.సత్తయ్య పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి పూజల్లో అర్చకులు

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ శాలివాహననగర్‌కాలనీలో రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు గణపతి, శివలింగం, ఆంజనేయస్వామి, జంటనాగులు, శిఖర ప్రతిష్ఠ జరిగాయి. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తి విగ్రహాన్ని కాలనీలో ఘనంగా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో కీర్తనలు ఆలపించగా ఊరేగింపు ముందుకు సాగింది. నిర్వాహకులు కౌశిక శ్రీనివాస్, బోనగిరి చంద్రశేఖర్, రాజ్‌కుమార్‌పటేల్ పాల్గొన్నారు.

షహీద్ భగత్‌సింగ్‌కు ఘన నివాళి

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): తన ప్రాణం కన్నా దేశ స్వాతంత్ర్యమే ప్రధానమని ఉరిశిక్షను స్వేచ్ఛగా ఆస్వాదించిన మహనుభావుడు షహీద్ భగత్‌సింగ్ అని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గసభ్యుడు బాతరాజు నరసింహ, ఇస్కాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ కొనియాడారు. భగత్‌సింగ్ జయంతి వేడుకలను సీపీఐ భగత్‌సింగ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జిల్లాల కృష్ణ, ఎండీ మహబూబ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గసభ్యుడు నరసింహ, గోపాల్



దిల్‌సుఖ్‌నగర్ కనకదుర్గ ఆలయంలో పూజల్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రాంచందర్, చంద్రశేఖర్‌రెడ్డి



ఆర్‌కేపురంలో ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ రాజశేఖర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీనివాస్, డీఎంలు వెంకటేష్, సమతారెడ్డి



హయత్‌నగర్ డివిజన్ రాజప్పనగర్‌లో దుర్గామాతను దర్శించుకుంటున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, కాలనీవాసులు



కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి పూజల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాలనీలోని భక్తులకు అన్నం వడ్డిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ, సురేంద్రనాథ్‌యాదవ్ దంపతులు

మహాచండీదేవి అలంకరణలో అమ్మవారు

మన్సూరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చే అమ్మవారి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా కోరారు. నాగోల్ డివిజన్ నల్లపోచమ్మ తల్లి ఆలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద నిర్వాహకుల ఆహ్వానం మేరకు కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సతీమణి, ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, కుమారులు ఉప్పల సాయికిరణ్, ఉప్పల సాయితేజ, కోడలు శార్వారీ పాల్గొన్నారు.



సాహెబ్‌నగర్ పెద్దమ్మతల్లి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న ఆలయ చైర్మన్ బుద్దోలు సదానందంగౌడ్, కాలనీవాసులు

నాగోల్ డీఎస్ఆర్‌కాలనీలో కార్పొరేటర్ పూజలు

నాగోల్ డివిజన్ పరిధిలోని దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఆదివారం స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన ప్రసాద వితరణలో పాల్గొన్న ఆమె భక్తులకు భోజనం వడ్డించారు. అనంతరం నిర్వాహకులు చింతల అరుణ, సురేంద్రనాథ్ యాదవ్ దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.



హుడాకాలనీలో దుర్గామాతను దర్శించుకుంటున్న మాజీమంత్రి హరీష్‌రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవిప్రసాద్, సేథామ, అరవింద్‌శర్మ

స్నేహపురిలో..

కొత్తపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలతో ఆలయాలు ప్రత్యేక పూజలు, అర్చనలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. స్నేహపురి పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆదివారం అమ్మవారి చండీ అవతారం వేళ మహాచండీ హోమం వేదమంత్రాల మధ్య భక్తులను అలరించింది. చండీ అవతారం విశేష ఘట్టాల మధ్య దుర్గామాత జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. రుత్విక్కుల మంత్రోచ్ఛారణల మధ్య కొనసాగిన హోమం పూర్ణాహుతితో ముగిసింది. సత్యానగర్, జనప్రియ అవెన్యూ, ఎస్‌బీహెచ్ కాలనీ, కొత్తపేట, మారుతీనగర్, ఎస్ఆర్ఎల్ కాలనీల్లో మండపాలు, ఆలయాల్లో హోమాలు, నవరాత్రి పూజలు నిర్వహించారు.

హయత్‌నగర్ : దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మునగనూర్‌లోని టెలిఫోన్‌కాలనీలో దుర్గాపోచమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గుత్తా వెంకట్‌రెడ్డి, సంగీత మోహన్‌గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ హరినాయక్, ఉపాధ్యక్షుడు లచ్చిరాంనాయక్, నాయకులు నవీన్‌రెడ్డి, చంద్రశేఖర్, గుర్రం గాంధీ, రవికుమార్, రాహుల్, సూర్యవంశీ, కేతన్, హరికృష్ణ, తిరుపతయ్య, నరేందర్, నాగరాజు పాల్గొన్నారు.



సాహెబ్‌నగర్ బతుకమ్మకుంటలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో చండీయాగం పూజల్లో మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, చంద్రకాంత్‌గౌడ్



మూసారాంబాగ్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిటీ చైర్మన్ యాదయ్య, కాంగ్రెస్ మలక్‌పేట సీనియర్ నాయకుడు మందడి విజయసింహారెడ్డి



స్నేహపురి వెంకటేశ్వర ఆలయంలో దుర్గా అమ్మవారి చండీ అవతారం వేళ మహాచండీ హోమం కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు



చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని పోచమ్మ ఆలయంలో మహాచండీదేవి అలంకరణలో ఉన్న దుర్గామాతకు పూజలు చేస్తున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి దంపతులు

ఆర్‌ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం

ఎల్‌బీనగర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వ్యక్తి నిర్మాణమే సమాజ నిర్మాణానికి పునాది అని విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలను వెంకటేశ్వరకాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన శశిధర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగాలన్నారు. నేటి కాలంలో ఐదవ తరం యుద్ధం పట్ల ప్రతి భారతీయుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఈ యుద్ధం ఆయుధాలతో కాకుండా ఆలోచనలతో, సాంకేతికతతో విలువలను దెబ్బతీయడమే లక్ష్యంగా కొనసాగుతుందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ సవాళ్లను గుర్తించి ఐక్యతతో జాతి అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్, గోవర్ధన్, అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవంలో వీహెచ్‌పీ నేత శశిధర్, కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

'ఆత్మ నిర్భర్ భారత్'లో ఆర్‌ఎస్ఎస్ పాత్ర

సరూర్‌నగర్ : మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు దూసుకుపోతున్నదని, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంగా సాగుతున్న పాలనకు ఆర్ఎస్ఎస్ సైతం ఎంతో సహకరిస్తున్నదని సంఘ్ ప్రతినిధి సునీల్ అంబేకర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వందేళ్లవుతున్న సందర్భంగా ఆదివారం బడంగ్‌పేట్‌లో నిర్వహించిన విజయదశమి ఉత్సవ్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ గడిచిన వందేళ్లలో ఆర్ఎస్ఎస్ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నదని, అయినా ఏనాడూ వెనకడుగు వేయకుండా దేశ సంస్కృతి సంరక్షణ కోసం పోరాడుతున్నదని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సుల్తాన్‌పూర్‌లోని డ్రైనేజీ సమస్యను బీజేపీ నాయకులకు వివరిస్తున్న మహిళలు

సుల్తాన్‌పూర్ మురుగు సమస్యను పరిష్కరించాలి

- గ్రామస్థుల డిమాండ్

సరూర్‌నగర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని సుల్తాన్‌పూర్‌లో ఏళ్లుగా డ్రైనేజీ సమస్య ఉన్నదని, దీన్ని పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు, బీజేపీ నాయకులు ఆరోపించారు. తమ సమస్య పరిష్కారం కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య గురించి తెలుసుకున్న బీజేపీ నాయకులు ఆదివారం క్లస్టర్-1 అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుల్తాన్‌పూర్‌లో పర్యటించి మురుగు సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యను వారికి వివరించారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ నాలుగు నెలలుగా గ్రామంలో మురుగు నీరు రోడ్లపై పారుతున్నదని, అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా గ్రామంలోని మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొంతం ప్రకాశ్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, రామాచారి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం మురళీధర్‌రెడ్డి, గూగుల్ల నరసింహ, మల్లేశ్, రవి, హన్మంత్‌రెడ్డి, లక్ష్మయ్య, వినోద్‌రెడ్డి, కిరణ్‌రాజ్, పవన్‌పటేల్ పాల్గొన్నారు.

వాగులపై బ్రిడ్జిల నిర్మాణంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ విఫలం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్యగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శివారు వాగులపై బ్రిడ్జిల నిర్మాణంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విఫలం అయ్యాయని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్యగౌడ్ విమర్శించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం, లష్కర్‌గూడలోని వాగులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, స్థానిక నాయకులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ రెండు గ్రామాల్లోని కల్వర్టులలో లేవల్‌లో ఉండడంతో చిన్నపాటి వర్షానికే కల్వర్టులను వరదనీరు ముంచెత్తుతుందన్నారు. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 4 ఏళ్ల క్రితం రెండు గ్రామాల్లో బ్రిడ్జిల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి చేతులు దులుపేసుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం బ్రిడ్జిల నిర్మాణాలను విస్మరించిందని ఆరోపించారు. 15రోజులుగా ఆయా బ్రిడ్జిలపై నుంచి వరద నీరు ప్రవహిస్తూనే ఉందన్నారు. అయినా అధికారులు, ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదన్నారు. వాగు లోపలి గ్రామాల ప్రజల సమస్యను దృష్టిలో పెట్టుకుని వెంటనే రెండు గ్రామాల్లో బ్రిడ్జిలను నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, దయానంద్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు సాయిగౌడ్, సీనియర్ నాయకులు పాపయ్యగౌడ్, బండిగారి విష్ణుగౌడ్, గోవర్ధన్‌గౌడ్, వీరస్వామిగౌడ్, నవీన్ పాల్గొన్నారు.



చిన్న ఏరు వాగును సందర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ తదితరులు

కండరాల క్షీణతపై అవగాహన

చంపాపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కండరాల క్షీణత అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని చంపాపేట డివిజన్‌లోని ఈస్ట్ మారుతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం తెలంగాణ మస్క్యులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆలూరి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ హాజరై మాట్లాడుతూ మస్క్యులర్ డిస్ట్రోఫీ ఒక తీవ్రమైన న్యూరో-మస్క్యులర్ వ్యాధి అని ఇది క్రమంగా కండరాలను బలహీనపరుస్తూ శరీరానికి అవసరమైన రోగనిరోధకశక్తి తగ్గిస్తుందని అన్నారు. తెలంగాణ మస్క్యులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆలూరి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తమకు ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాల కల్పన సాధనే లక్ష్యం అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇస్తున్న మాదిరిగా కండర క్షీణత బాధితులకు నెలకు రూ.15వేల పింఛన్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నేత అందె రాంబాబు, టీవీహెచ్ఎస్ఎస్ జి.కిరణ్, ఎన్‌పీడీఓ నల్గొండ శ్రీను, గట్టు వినోద్‌కుమార్, శివకుమార్, సతీష్‌చంద్ర, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్

ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

సంతోష్‌నగర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ సంతోష్‌నగర్ కాలనీకి చెందిన మహ్మద్ అబుబాకర్ సిద్ధిఖీ(21) ఆటో నడిపేవాడు. కొంత కాలంగా కుటుంబసభ్యులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. నాలుగు నెలల క్రింతం వివాహం అయ్యింది. కుటుంబపోషణ భారం కావడంతో మనస్థాపంతో ఆదివారం ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ వెంకటేశ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థి..



నవీన్‌కుమార్

హయత్‌నగర్ : సీలింగ్ ఫ్యానుకు చీరతో ఉరేసుకుని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడాకు చెందిన రసూరి నవీన్‌కుమార్(19) ఇబ్రహీంపట్నం మంగళ్‌పల్లిలోని శ్రీఇందు కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరు లేనిది చూసి చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. డయల్ 100కు ఫోన్ రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పండుగకు ఊరు వెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త!

- పోలీసు సూచనలు పాటించండి
- దొంగతనాల నివారణకు సహకరించండి

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఘనంగా జరుపుకునే దసరా పండుగ వచ్చిందంటే.. పండుగకు పది రోజుల ముందు నుంచే అంతటా పండుగ వాతావరణం నెలకొంటుంది. ఈ నేపథ్యంలో దసరా పండుగకు విద్యాసంస్థలకు ఎక్కువ రోజులు సెలవులు ఇవ్వడంతో నగరంలో ఉంటున్న గ్రామీణ ప్రాంతవాసులు ఊరుబాటపడతారు. నగరంలోని ఇళ్లకు తాళాలు వేసి నగరవాసులు సొంత ఊరు వెళ్లడాన్ని అదునుగా చేసుకుని దొంగలు తమ చేతి వాటానికి పనిచెప్పేందుకు సిద్ధంగా ఉంటారు. ఈ నేపథ్యంలో పండుగకు ఊరు వెళ్లే వారు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలంటున్నారు రాచకొండ పోలీసులు. దొంగతనాల నివారణ కోసం పోలీసు సూచనలు, సలహాలు పాటించాలని సరూర్‌నగర్, చైతన్యపురి పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్లే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తు పోస్టర్లు, బ్యానర్లు రూపొందించారు. రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశానుసారం ప్రతి కాలనీలో పోస్టర్లు అంటించడంతో పాటు ఆటోలకు బ్యానర్లు కట్టి, మైకుల ద్వారా వీధి, వీధి తిరుగుతూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నట్లు సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వెల్లడించారు. బ్యానర్లతో పాటు సోషల్ మీడి యా ద్వారా కూడా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని, పోలీసు సూచనలు పాటించి, దొంగతనాల నివారణకు పోలీసులకు సహకరించాలని విన్నవిస్తున్నారు. కాలనీల్లో సంచరించే అనుమానిత వ్యక్తుల గురించి 100 నెంబర్‌కు గానీ, రాచకొండ పోలీస్ కంట్రోల్ రూం (సెల్ నెం.8712662666, వాట్సాప్ నెం. 8712662111) లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పోలీసు సూచనలు పాటించండి: సైదిరెడ్డి, ఇన్‌స్పెక్టర్

- ఊరు వెళ్లే సమయంలో వీలైనంత వరకు విలువైన వస్తువులు, నగలు, నగదు ఇంట్లో పెట్టకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవడం శ్రేయస్కరం.
- సెంట్రల్ లాక్ చేసిన ఇంటికి బయట నుంచి గొళ్లెం పెట్టరాదు.
- బయట గేటుకు లోపలి నుంచి తాళం వేసి, ఇంటి గడప ముందు చెప్పులు ఉంచాలి.
- ఇంటి ముందు గదిలో లైట్ వేసి ఉంచాలి.
- పేపర్ బాయ్, పాలు వేసే వ్యక్తులకు రావద్దని చెప్పాలి.
- ఊరు వెళ్లే సమయంలో ఇంటి పక్కన నమ్మకమైన వారికి, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఇంటి నుంచి బయటకు వెళ్లే మహిళలు, ఇంటి ముందు ముగ్గులు వేసే మహిళామణులు బంగారు ఆ భరణాలు ధరించకపోవడం శ్రేయస్కరం, ఒక వేళ ధ రించినా కనబడకుండా, తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- తాళం వేసిన తర్వాత డోర్ కర్టన్ వేసి తాళం కనబడకుండా జాగ్రత్తలు తీసుకోవడం శ్రేయస్కరం
- ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటె, మొబైల్ యాప్ ద్వారా సీసీ కెమెరా దృశ్యాలు ఎప్పటికప్పుడు వీక్షించే అవకాశం ఉంటుంది. దీని మూలంగా ఇంటి వద్ద కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించవచ్చు.



సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి